సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం ׀ 9 ׀ ఆగస్టు ׀ 2024



ఆయకట్టుకు నీరు కట్

నారాయణపురం ఆయకట్టు రైతులకు కష్టాలు తప్పడం లేదు. కాలువ ద్వారా నీరందడం లేదు.
- 8లో



చేపల చెరువుపై విషం

చేపల చెరువుపై విష ప్రయోగం జరిగింది. రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లింది.
- 8లో



మిస్సింగ్ బ్లాకులపై..

సాక్షి కథనంపై అధికారులు స్పందించారు. మిస్సింగ్ బ్లాకులపై విచారణ చేపట్టారు.
- 8లో

న్యూస్‌రీల్

‘117 జీఓ రద్దు చేయాలి’

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన ఉపాధ్యాయుల పని సర్దుబాటును జీఓ నంబర్ 117ను రద్దు చేసిన తర్వాతే అమలు చేయాలని డీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లాశాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పూజారి హరి ప్రసన్న, పేడాడ కృష్ణారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 117 జీఓను రద్దు చేయకుండానే ఆ జీఓకు అనుగుణంగా విద్యాశాఖ ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు సమాయత్తం కావడాన్ని డీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఆ జీఓలోని అసంబద్ధమైన ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి, ఆంగ్ల భాషా మాధ్యమం, సెక్షన్ల విధానం వంటి అంశాలను సవరించకుండానే పని సర్దుబాటు చేయడం ఎంతమాత్రం సరికాదన్నారు. ఇలాంటి ఏకపక్ష నిర్ణయాలతో విద్యారంగానికి తీవ్ర విఘాతం కలుగుతుందని భావిస్తున్నట్టు చెప్పారు. తక్షణమే 117 జీఓను రద్దు చేసి, రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన తర్వాతనే పని సర్దుబాటు అయ్యే విధానాలను రూపొందించాలని కోరారు.

పీజీ నాలుగో సెమిస్టర్‌లో 82.28 శాతం ఉత్తీర్ణత

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల పరిధిలో పోస్టు గ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ గురువారం విడుదల చేశారు. ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచారు. పరీక్షకు 429 మంది హాజరు కాగా, 353 మంది ఉత్తీర్ణత సాధించారు. 82.28 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సబ్జెక్టు వారీగా పరిశీలిస్తే ఎకనామిక్స్ 12 మందికి 12, ఇంగ్లిష్ 8 మందికి 8, రూరల్ డెవలప్‌మెంట్ 9 మందికి 9, సోషల్ వర్క్ 13 మందికి 13, తెలుగు 9 మందికి 8, ఎంకాం 25 మందికి 25, ఎంఈడీ 37 మందికి 36, ఎంఎల్ఐఎస్సీ 18 మందికి 18, కంప్యూటర్ సైన్స్ 28 మందికి 28, అప్లయిడ్ మ్యాథ్స్ 8 మందికి 8, జువాలజీ 12 మందికి 9, అనలిటికల్ కెమిస్ట్రీ 47 మందికి 44, బయో టెక్నాలజీ 24 మందికి 24, ఫిజిక్స్ 14 మందికి 14, ఆర్గానిక్ కెమిస్ట్రీ 147 మందికి 114, మ్యాథ్స్ 9 మందికి 9, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ 12 మందికి ఏడుగురు ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్ అవసరమనుకునే విద్యార్థులు 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

‘4జీ సిమ్‌గా అప్‌గ్రేడ్ చేసుకోండి’

శ్రీకాకుళం అర్బన్: బీఎస్ఎన్ఎల్ దశల వారీగా 4జీ టెక్నాలజీని శ్రీకాకుళం జిల్లాలో ప్రవేశపెడుతోందని, వినియోగదారులు 2జీ/3జీ సిమ్ కార్డును తక్షణమే 4జీ సిమ్‌గా అప్‌గ్రేడ్ చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ శ్రీకాకుళం జిల్లా జనరల్ మేనేజర్ నాయుడు మర్రి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. 4జీకి అప్‌గ్రేడ్ చేసిన తర్వాత, 2జీ, 3జీ సేవలు కూడా కొనసాగుతాయన్నారు. 2జీ/3జీ సిమ్ ఉపయోగిస్తున్న వినియోగదారులు, కేవైసీ పూర్తి చేయమని సందేశం వచ్చిన వినియోగదారులు దగ్గరలో ఉన్న బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్/ఫ్రాంచైజీ/రీటైలర్లు/ఏజెంట్లను సంప్రదించాలని పేర్కొన్నారు. బీఎస్ఎన్ఎల్ పై సేవలను పూర్తి ఉచితంగా అందిస్తోందని తెలిపారు.



సిక్‌కోలు



జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లా సీజనల్ వ్యాధుల గుప్పిట చిక్కుకుంది. అటు ఒడిశా సరిహద్దు నుంచి ఇటు విజయనగరం సరిహద్దు వరకు వ్యాధులు విజృంభిస్తున్నాయి. డయేరియా, డెంగీ, మలేరియా, విష జ్వరాలతో ఊళ్లకు ఊళ్లు ఆస్పత్రుల పాలవుతున్నాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం, కొత్తగా గెలిచిన వారికి ప్రజారోగ్యంపై సమీక్ష చేసే తీరిక లేకపోవడంతో ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతున్నాయి.

- సీజనల్ వ్యాధులతో వణుకుతున్న జిల్లా
- డయేరియా, డెంగీ, మలేరియా, విష జ్వరాల విజృంభణ
- రోగులతో కిక్కిరిసిపోతున్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు
- ప్రజారోగ్యంపై సమీక్షించేందుకు నేతలకు దొరకని తీరిక





సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/అరసవల్లి:

వర్షాకాలంలో జిల్లాలో వ్యాధులు ముసురుతున్నాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల వ్యాధులు ప్రబలుతున్నట్టు స్పష్టంగా కనబడుతోంది. ఎక్కడికక్కడ మురుగు పేరుకుపోవడం, తాగునీరు కలుషితం కావడంతో వ్యాధులు తాండవమాడుతున్నాయి. చాలా ప్రాంతాలు దోమలకు స్థావరాలుగా మారిపోయాయి. ఈగలైతే స్వైర విహారం చేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 8వేల కేసులు అధికారికంగా నమోదయ్యాయి. స్టాప్ డయేరియా క్యాంపెయిన్ పేరిట ఆశావర్కర్లు, ఏఎన్ఎంల సహాయంతో స్పెషల్ డ్రైవ్‌ను జూలై 1న ప్రారంభించారు. ఇందులో 2.97 లక్షల మందికి సర్వే చేయగా 8వేల జ్వరాల కేసులు బయటపడ్డాయి. వీటిలో 120 వరకు డెంగీ కేసులు, 23 మలేరియా కేసులు ఉన్నాయి. ఇక అధికారుల దృష్టికి రానివెన్నో. ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్న, పొందుతున్న రోగుల సంఖ్య ఇంతకుమించి ఉంటాయని తెలుస్తోంది.

ప్రజారోగ్యంపై శీతకన్ను..

ప్రజారోగ్యంపై ఈ ప్రభుత్వం శీతకన్ను వేసింది. సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని అధికార యంత్రాంగం ముందస్తుగా అప్రమత్తం కావాలి. ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ రూపొందించుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పంచాయతీ శాఖ, వైద్యారోగ్య శాఖ, సంబంధిత ప్రజారోగ్య శాఖలు సంయుక్తంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా చూసుకోవడమే కాకుండా ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనా వేసి చర్యలు తీసుకోవాలి. కానీ ఎక్కడా ఆ ప్రయత్నం జరగడం లేదు. సాధారణంగా సీజన్‌లో పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలి. నీటి నిల్వలు లేకుండా చూడాలి. చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలి. మురుగునీటి కాలువల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి. తాగునీటి పథకాలను క్లోరినేషన్ చేయాలి. కానీ వీటిపై సమీక్ష నిర్వహించిన దాఖలాలే లేవు. డయేరియా, జ్వరాలపై పత్రికల్లో కథనాలు వచ్చాక పరుగులు తీసి, హడావుడి చేయడం తప్ప ముందస్తుగా అప్రమత్తం చేసిన పరిస్థితులు కనిపించ లేదు.

నేతలకు పట్టని ప్రజారోగ్యం..

వర్షాల సీజన్‌లో అధికారులను అప్రమత్తం చేసేలా ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలి. కానీ తాజాగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, మంత్రులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ప్రజారోగ్యంపై ప్రత్యేకంగా సమీక్షలు చేసిన దాఖలాలు కనిపించలేదు. ఇసుక దోపిడీపై చూపిన శ్రద్ధ ప్రజారోగ్యంపై చూపలేకపోయారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇటువంటి పరిస్థితుల్లేవు. సీజనల్ వ్యాధులపై ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి కట్టడి చేశారు. ఇంత ఆందోళనకర పరిస్థితులు ఆ ఐదేళ్లు చూడలేదు. కరోనా వంటి మహమ్మారి విజృంభించినప్పుడే అన్ని శాఖలు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పనిచేసి అదుపులోకి తెచ్చారు. అప్పట్లో రాష్ట్రంలోనే మన జిల్లా అగ్రగామిగా నిలిచింది.

జ్వరంతో మహిళ మృతి



శోభ

మండలంలోని పలాసపురం గ్రామానికి చెందిన మహిళ సంక శోభ (36) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. పదిరోజుల కిందట ఆమెకు వైరల్ ఫీవర్ వచ్చింది. అప్పటి నుంచి అనారోగ్యంగా ఉండి మృతి చెందారని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదే విషయంపై కొర్లాం ప్రాథమిక ఆరోగ్యం కేంద్ర వైద్యాధికారిణి సౌజన్యను సంప్రదించగా శోభ మృతికి వైరల్ ఫీవర్ కారణం కాదని, ఆమెకు ఎప్పటినుంచో అనారోగ్య సమస్యలు ఉన్నాయని తెలిపారు. గ్రామస్తులు గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరుతున్నారు. - సోంపేట

- జి.సిగడాం మండలం మెట్టవలసలో డయేరియా ప్రబలిన తర్వాత ఈ నెల 5వ తేదీన పైల సావిత్రమ్మ చనిపోయారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ప్రాణాలు విడిచారు.
- మెట్టవలసలో ఈనెల 7వ తేదీన గొర్లె చిన్న అప్పలనాయుడు అనే వృద్ధుడు వాంతులు విరేచనాలతో బాధపడుతూ రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ గ్రామంలో ఇప్పటి వరకు 81 కేసులు నమోదైనట్టు తెలుస్తోంది.
- సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస గిరిజన బాలిక ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మలేరియా బారిన పడి ఒక బాలిక మృతి చెందింది. మరో ఏడుగురు మలేరియాతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు.
- టెక్కలి మండలం వలియాసాగరంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలు ప్రబలుతున్నా యి. పదుల సంఖ్యలో వ్యాధి బారిన పడ్డారు.
- కంచిలి మండలంలో డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి.
- కోటబొమ్మాళి కేజీబీవీలో డయేరియా ప్రబలి 22 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కోటబొమ్మాళి ఆస్పత్రిలో చికిత్స పొందారు.
- ఎచ్చెర్ల మండలం పరిధిలోని ఎచ్చెర్ల, ముద్దాడ, కొంగరాం గ్రామాల్లో మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు ప్రబలి సమస్యగా మారాయి.
- ఇచ్ఛాపురం మండలం డొంకూరు, ఈదుపురం, ధర్మపురం, బిర్లంగి, మశాఖపురం, తేలుకుంచి, మండపల్లి, లొద్దపుట్టి, ఎం.తోటూరు, భవానీపురం, బాలకృష్ణాపురం, కేదారిపురం, ముచ్చింద్ర గ్రామాల్లో తరచూ జ్వరాల బారిన పడుతూ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.
- పాతపట్నం పట్టణంలో జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకి పెరుగుతోంది. రోజుకి 160ఓపీ ఉంటే అందులో 50వరకు జ్వర బాధితులు ఉంటున్నారు.



సారవకోట: సత్రాంలో పారిశుద్ధ్య లోపం

అప్రమత్తంగా ఉన్నాం..



జిల్లాలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉన్నాం. జ్వరాల కేసులు మాత్రం బాగా పెరిగాయి. గత నాలుగు వారాల్లోనే 7 వేల కేసులు నమోదయ్యాయి. సుమారు 2.97 లక్షల శాంపిల్స్ కలెక్ట్ చేశాం. ఇంకా పరీక్షలు కొనసాగిస్తున్నాం. ఇటీవల జిల్లా కేంద్రంలో గిరిజన హాస్టల్‌తో పాటు ఎస్ఎం పురం, కోటబొమ్మాళి, టెక్కలి, నందిగాం తదితర చోట్ల వసతి గృహాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాం. దాదాపుగా బయట తీసుకున్న జంక్ ఫుడ్‌తో పాటు తాగునీటి కలుషితమే ఇందుకు కారణాలుగా తేలాయి. ఇక స్టాప్ డయే రియా పేరిట అన్ని గ్రామాల్లోనూ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీల బృందం ఇంటింటికీ వెళ్లి ప్రత్యేకంగా 5 ఏళ్ల లోపు వయస్సున్న పిల్లల వివరాలను నమోదు చేస్తారు. డయేరియా లక్షణాల్లో భాగంగా విరేచనాలను నియంత్రించేందుకు ప్రతి పిల్లవాడికి ఓఆర్ఎస్ ప్యాకెట్, జింక్ మాత్రలను అందజేస్తున్నాం. మెట్టవలసలో కూడా తాగునీటి కలుషితమే కారణమని తెలుస్తోంది.

– డాక్టర్ మీనాక్షి, డీఎంహెచ్ఓ



ఇచ్ఛాపురం రూరల్ : ముచ్చింద్ర పాఠశాలకు వెళ్లే దారి



మెట్టవలసలో ఫాగింగ్

మెట్టవలసను వదలని డయేరియా

మెట్టవలసను డయేరియా వణికిస్తోంది. వారం రోజులుగా గ్రామాన్ని పట్టి పీడిస్తోంది. ఈ నెల 5వ తేదీ నాటికి గ్రామంలో 47 మంది బాధితులు ఉండగా.. 6వ తేదీకి 63, 7వ తేదీకి 73కు ఆ సంఖ్య పెరగడంతో ఊరివారంతా భయపడుతున్నారు. గురువారం అదనంగా మరో 8 కేసులు నమోదయ్యాయి. శ్రీకాకుళం, రాజాం, పొందూరు ప్రభుత్వాస్పత్రులకు రోగులను తరలిస్తున్నారు. స్థానిక వైద్యాధికారులు బుడుబూరు యశ్వంత్, పేకల సుమబిందు వైద్యసేవలు అందిస్తున్నారు. - జి.సిగడాం

కిటికీలు లే‘వంట’..!



విద్యార్థులు ఉపయోగించే మరుగుదొడ్డి వద్ద మధ్యాహ్న భోజనం కోసం బారులు తీరిన విద్యార్థులు

ఇచ్ఛాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 270. గత ప్రభుత్వ హయాంలో పక్కాగా వంట శాలను కట్టారు. కానీ కిటికీలు లేవన్న సాకుతో బాలబాలికలు ఉపయోగించే మరుగుదొడ్డి వద్దే వంటావార్పు చేస్తున్నారు. గురువారం పాఠశాలలో జరిగిన విద్యాకమిటీ ఎన్నికల సమయంలో మరుగుదొడ్డి వద్దనే వంటలు చేస్తుండటంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై హెచ్ఎం ఉషారాణి వివరణ కోరగా... వంట శాలకు కిటికీలు లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో మరుగుదొడ్డి వద్ద మధ్యాహ్న భోజనం వంటలు చేస్తున్నట్లు తెలిపారు. – ఇచ్ఛాపురం రూరల్

టీడీపీ బడితెగింపు



అక్కయ్యవలసలో బాహాబాహీకి దిగిన టీడీపీకి చెందిన రెండువర్గాలు

- ఎస్ఎంసీ ఎన్నికల్లో రాజకీయం
- ఆధిపత్యం కోసం దౌర్జన్యాలకు పాల్పడిన టీడీపీ నాయకులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: టీడీపీ బడుల్లో బరి తెగించింది. ప్రశాంతంగా జరగాల్సిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను ఆ పార్టీ నాయకులు రాజకీయం చేశారు. ఆధిపత్యం కోసం దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు. తమ పార్టీకి చెందిన వాళ్లు ఓడిపోతే ఎక్కడ బలహీన పడ్డామని అనుకుంటారోనని గెలవలేని చోట గొడవలు సృష్టించా రు. పరిస్థితులు అనుకూలంగా లేవనుకుంటే ప్రధానోపాధ్యాయులను బెదిరించి ఎన్నికలను వాయిదా వేయించారు. టీడీపీ నాయకుల ఆగడాలను కూడా వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు ధీటుగా ఎదుర్కొన్నారు. కొన్నిచోట్ల ఎన్నికల నిర్వాహకులు అధికార పక్ష నేతలకు అనుకూలంగా వ్యవహరించారు.

పోలీసు పహారా నడుమ ఎన్నికలు..

ప్రశాంతంగా జరగాల్సిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు ఈ సారి పోలీసు పహారా నడుమ జరిగాయి. తల్లిదండ్రుల అభిప్రాయం మేరకు జరగాల్సిన ఎన్నికలపై రాజకీయం చేసి కూటమి నాయకులు పసుపు ముద్ర వేశారు. విద్యార్థుల తల్లిదండ్రులంతా ఒకవైపు ఉంటే, వారొక వైపు ఎన్నికలను ఏకగ్రీవం చేసుకోవాలని చూశారు. ఎన్నికల నిర్వాహకులను గుప్పెట్లో పెట్టుకుని కొన్నిచోట్ల అనుకున్నది సాధించారు. ప్రతిఘటించిన చోట ఎన్నికలను బలవంతంగా వాయిదా వేయించారు. మొత్తానికి జిల్లా వ్యాప్తంగా 2643పాఠశాలలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా 2441 పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. 202 పాఠశాలల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఎన్నికలైన వాటిలో 1796 ఏకగ్రీవమయ్యాయి. 645 ఓటింగ్ ద్వారా ఎన్నికయ్యాయి.

- పొందూరు మండలంలోని రాపాక గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీల మధ్య ఎస్ఎంసీ చైర్మన్ పదవికి పోటీ జరిగింది. టీడీపీ విజయం సాధించింది.
- ఎచ్చెర్ల మండలం ఎన్నికల్లో అధికారులు ఏకపక్షంగా కూటమి నాయకులకు మద్దతుగా నిలిచారు. ఎస్ఎంపురం ప్రాథమికోన్నత పాఠశాలలో సంధ్యా గజపతి వర్గం పోటీకి ప్రయత్నించగా, అక్కడ చౌదరి బాబ్జీ ఆధ్వర్యంలోని టీడీపీ నాయకులు అడ్డుకొని ఎక గ్రీవం చేసుకున్నారు. బొంతలకోడూరులో అధికార పార్టీనాయకులు ప్రతికూల పరిస్థితులు ఉండటంతో క్వారం సమస్య సృష్టించారు. దీంతో ఎన్నికలు రద్దయ్యాయి.
- పోలాకి మండలం ఏపీ మోడల్ స్కూల్ ఈదలవలసలో వైఎస్సార్ సీపీ బలపరిచిన వ్యక్తికి ఓటింగ్ శాతం ఎక్కువగా ఉండటంతో... పేరెంట్స్ తక్కువ శాతం వచ్చారని చెప్పి చైర్మన్ ఎలక్షన్‌ను నిలిపివేశారు.

పత్రాల చించివేత



చించివేసిన పత్రాలు

చిన్న ఉప్పరివానిపేట ప్రైమరీ పాఠశాల కమిటీ ఎన్నిక పూర్తయిన తర్వాత కొందరు వ్యక్తులు పత్రాలను చించివేసి పాఠశాల సమీపంలో పడేశారు. ఈ సంఘటనపై గార పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీనిపై హెచ్ఎం శేషగిరిరావు వద్ద ప్రస్తావించగా సంఘటన జరగడం నిజమేనన్నారు. - గార

మంత్రి అచ్చెన్న ఇలాకాలో..

కోటబొమ్మాళి మండలం దంత యూపీ పాఠశాలలో స్కూల్ కమిటీ ఎన్నికను టీడీపీ వర్గీయులు అడ్డుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. అధిక శాతం మంది మద్దతు పలుకుతుండడంతో హెచ్ఎంపై ఒత్తిడి తెచ్చి ఎన్నిక వాయిదా వేయించారు. ఇక్కడ జరిగిన ఘర్షణను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న వైఎస్సార్ సీపీ మద్దతుదా రుడి ఫోన్‌ను కూడా పగలగొట్టారు. అనంతరం వారిని బయటకు పంపి గేటుకు తాళం వేశారు. దీంతో హెచ్ఎం ఒత్తిడి తట్టుకోలేక ఎన్నిక వాయిదా వేశారు. అక్కయ్యవలసలోనూ గొడవ జరిగింది. -సాక్షి టాస్క్‌ఫోర్స్

ఎస్ఐపై టీడీపీ నాయకుడి జులుం

జలుమూరు ఎస్ఐ మధుసూదనరావుపై ఓ టీడీపీ నాయకుడు దౌర్జన్యం ప్రదర్శించాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మునుకోటి ఆనందరావు, బాలా కుమార్, జలుమూరు అప్పారావు, దుండంగి చిన్నారా వు, కొర్నాన తారక, ఉర్లాపు వెంకట్రావు, యర్రాగుల గిరి, బోర లక్ష్మణరావు, బేరి లక్ష్మణరావు, పవన్, యజ్జల జగన్‌లు గురువారం పోలీస్‌స్టేషన్ లోపలకు వెళ్లారు. అక్కడ మునుకోటి దా మోదరరావు ఎస్ఐను దుర్భాషలాడారు. స్కూల్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన వారితో ఎందుకు మాట్లాడావంటూ పెద్దగా కేకలు వేశారు. బదిలీ చేయించేస్తా అని బెదిరించారు. దీంతో ఆయనపై కేసు నమోదు చేశారు.

-సాక్షి టాస్క్‌ఫోర్స్

ఎన్నికపై రాజకీయ ఒత్తిడి



ఎన్నిక నిర్వహించాలని కోరుతున్న తల్లిదండ్రులు

కణితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఎస్ఎంసీ ఎన్నికలు రాజకీయ ఒత్తిడితో నిలిచిపోయాయి. స్థానిక ప్రధానోపాధ్యాయుడు కింతలి సీతారాజు సుమారు 2 గంటలు కాలయాపన చేయడంతో సమయం మించి పో యి ఎన్నిక వాయిదా వేశారు. టీడీపీ నాయకుల ఒత్తిడితో ఉదయం 11 గంటలకు గదిలోకి వెళ్లి 1 గంట వరకు బయటకు రాలేదు. -నందిగాం

ఎన్నికలు జరగాల్సిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు	2643
ఎన్నికలు జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు	2441
ఏకగ్రీవం ద్వారా ఎన్నికైన కమిటీలు	1796
ఓటింగ్ ద్వారా ఎన్నికైన కమిటీలు	645
ఎన్నికలు వాయిదా పడిన కమిటీలు	202

పూర్వవైభవం దిశగా బీఎస్ఎన్ఎల్



- ప్రైవేటు కంపెనీల ధరల బాదుడుతో బీఎస్ఎన్ఎల్‌కు ఆదరణ
- అందుకు తగ్గట్టుగా 4జీ సేవలు విస్తరణ
- ఇప్పటికే 50 టవర్లను 4జీ టవర్లుగా మార్పు
- నెల రోజుల వ్యవధిలో 4,729 కొత్త కనెక్షన్లు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: బీఎస్ఎన్ఎల్ పూర్వవైభవం దిశగా పయనిస్తోంది. ప్రైవేటు ఆపరేటర్లు భారీగా రీచార్జీల ధరలు పెంచడంతో భారత సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్)కు మంచిరోజులు వచ్చాయి. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు సంస్థ అడుగులు ముందుకేస్తోంది.

తక్కువ ధరలతో..

ఇన్నాళ్లూ పోటీ కంపెనీలకు 4జీ, 5జీ ఉండడంతో అంతా వాటినే వినియోగించేవారు. దీంతో బీఎస్ఎన్ఎల్ వెనుకబడి పోయింది. ఒక ఇంట్లో ప్రైవేటు కంపెనీలకు చెందిన సిమ్‌లను వినియోగిస్తున్నవారు నలుగురు ఉంటే నెలకు రూ.1200వరకు ఖర్చు చేయాల్సి వస్తుండగా, ఇప్పుడదే బీఎస్ఎన్ఎల్ వినియోగిస్తే వైఫై సౌకర్యంతో పాటు సేవలకు రూ.400 -రూ.500కు మించి అవ్వడం లేదు. దీంతో బీఎస్ఎన్ఎల్ వైపు చాలా మంది మొగ్గుచూపుతున్నారు.

పెరుగుతున్న పోర్టబులిటీ..

ఎయిర్‌టెల్, ఐడియా, జియో వంటి ప్రైవేటు కంపెనీలు ఒక్కసారిగా చార్జీల రేట్లు పెరగడంతో ఇతర కంపెనీల నెట్‌వర్క్ నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మారే మొబైల్ నంబరు పోర్టబులిటీ(ఎంఎన్‌పీ) రోజురోజుకీ పెరుగుతోంది. రోజుకు 150 నుంచి 200 మంది తమ నంబరును మొబైల్ నంబరు పోర్టబులిటీకి పెడుతున్నారు. అలాగే రోజుకి 500 మంది కొత్త బీఎస్ఎన్ఎల్ సిమ్‌లను కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ సుమారు 150 నుంచి 200 మంది వినియోగదారులు ఇతర నెట్‌వర్క్‌ల నుంచి బీఎస్ఎన్ఎల్ వైపు మారుతున్నారు. గత నెల రోజులుగా చూస్తే జూలై నెలలో 3324 మంది, ఆగస్టులో (7వ తేదీ నాటికి) 1405 మంది ఇతర నెట్‌వర్క్‌ల నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మారారు.

విస్తరిస్తున్న సేవలు..

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 229 టవర్లు ఉండగా ఇప్పటికే 50 టవర్లుకు పైగా 4జీ టవర్లుగా మార్పు చేశారు. మిగిలిన టవర్లను కూడా త్వరలోనే 4జీ గా మార్పు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

డిమాండ్ పెరుగుతోంది



బీఎస్ఎన్ఎల్ కనెక్షన్లకు డిమాండ్ పెరిగింది. ఇతర కంపెనీలు చార్జీలు పెంచడంతో భారాన్ని భరించలేక బీఎస్ఎన్ఎల్‌ను ఎంచుకుంటున్నారు. 4జీ సేవలు విస్తృతంగా చేసేందుకు బీఎస్ఎన్ఎల్ టవర్లను 4జీ టవర్లుగా మారుస్తున్నాం. 4జీ టవర్లు లేని ప్రాంతాల్లో సైతం 4జీ టవర్లును ఏర్పాటు చేస్తున్నాం.

– నాయుడు మర్రి, బీఎస్ఎన్ఎల్ జీఎం

క్లుప్తంగా

దిశా డీఎస్పీ స్థానచలనం


డీఎస్పీ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్ : సార్వత్రిక ఎన్నికల ముందు శ్రీకాకుళం దిశా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా వచ్చిన రుప్పా శ్రీనివాసరావును బదిలీ చేస్తున్నట్లు మంగళగిరి డీజీపీ కార్యాలయం నుంచి బుధవారం అర్ధరాత్రి దాటాక ఉత్తర్వులు వచ్చాయి. ఈయన ఒంగోలు ఎస్‌డీపీఓగా (డీఎస్పీగా) వెళ్లనున్నారు. ఈయన స్థానంలో ఇంకా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. చేసే కొద్ది కాలంలో సహకరించిన సిబ్బందికి, ఎస్పీకి డీఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

మందుబాబులపై కేసులు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని వాంబే కాలనీ, దమ్మలవీధి, కంపోస్టు కాలనీ, హయాతీనగర్, 80 ఫీట్ మార్గంలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించే వారిపై బుధవారం రాత్రి ఒకటో పట్టణ పోలీసులు ఎస్పీ ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 25 మంది పట్టుబడగా వారిపై కేసులు నమోదు చేశారు.

కొండచిలువ హతం


హతమార్చిన కొండచిలువ

మెళియాపుట్టి: ఓ భారీ కొండచిలువను మండల కేంద్రంలోని కూన అప్పలరాజు ఇంటికి సమీపంలో యువకులు హతమార్చారు. గురువారం ఉదయం కోళ్ల గూడులో శబ్దాలు రావడంతో వెళ్లి చూడగా ఓ భారీ కొండచిలువ ఉండటంతో భయభ్రాంతులకు గురయ్యారు. అయితే అప్పలరాజుకు చెందిన నాలుగు నాటుకోళ్లను కొండ చిలువ మింగేసి కదలలేని స్థితిలో ఉండడంతో పలువురు యువకులు దాన్ని బయటకు తీసి హతమార్చారు.

వయనాడ్ బాధితులకు బైపల్లి భారీ విరాళం

టెక్కలి రూరల్: ప్రకృతి విలయానికి అతలాకుతలమైన కేరళలోని వయనాడ్ బాధితులకు టెక్కలి నియోజకవర్గ జై భారత్ నేషనల్ పార్టీ ఇన్‌చార్జ్ బైపల్లి పరమేశ్వరరావు రూ.లక్ష అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మన వంతు సాయం చేయాలన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధికి తన వంతు సాయం చేశానని తెలిపారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి



కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఐదో వార్డు తాళ్లభద్ర గ్రామం సుమ్మాదేవి రైల్వేస్టేషన్‌ల మార్గ మధ్యంలో రైలు పట్టాలపై ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. గురువారం ఉదయం స్థానికులు గుర్తించి పలాస జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. రైలు ప్రమాదంలో చనిపోయి ఉంటాడని వారు చెబుతున్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. జీఆర్పీ ఎస్‌ఐ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ బీచ్ కబడ్డీ పోటీలకు హసీనా ఎంపిక


షేక్ హసీనా

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు శ్రీకాకుళం జిల్లా నుంచి షేక్ హసీనా ఎంపికైంది. ఈ పోటీలు త్వరలో బీహార్‌లోని గయా నగరం వేదికగా జరగనున్నాయి. నెల్లూరు జిల్లాలో ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో మెరుగైన ఆటతీరుతో రాణించడంతో జాతీయ పోటీలకు ఎంపికైంది. హసీనా జాతీయ పోటీలకు ఎంపిక కావడంపై ఆ సంఘ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, ఎస్‌ఐ నక్క కృష్ణారావు, సాధు మునలినాయుడు, జి.యమునరాణి, డి.తవిటమ్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఆయకట్టుకు.. నీరు కట్!

- నారాయణపురం ఆయకట్టు రైతులకు తప్పని కష్టాలు
- సాగునీరు అందక ప్రారంభం కాని నాట్లు


దుప్పలవలస సమీపంలో పిచ్చిమొక్కలతో నిండిన కాలువ


తోటపాలెంలో నాట్లు కోసం కోసం ఎదురు చూస్తున్న పొలాలు

ఎచ్చెర్ల క్యాంపస్: అన్నదాతకు సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఖరీఫ్‌లో ఆగస్టు వచ్చేసినా అనేక చోట్ల ఇంకా వరి నాట్లు పడని దుస్థితి నెలకొంది. ఎచ్చెర్ల మండలంలో నారాయణపురం ఆయకట్టు కింద 7175 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. సంతకవిటి, పొందూరు మండలాలకు సాగునీరు అందాక ఎచ్చెర్ల రావాల్సి ఉంది. అయితే ఇబ్రహింబాద్ వరకు మాత్రమే కాలువ మరమ్మతులు పూర్తిచేశారు. అక్కడి నుంచి వదిలేశారు. కనీసం అత్యవసర పనులు సైతం నిర్వహించలేదు. దీంతో ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేట, ఇబ్రహింబాద్, పూడివలస, తమ్మినాయుడుపేట, కుశాలపురం గ్రామాలు వరకు మాత్రమే సాగునీరు అందుతుంది. ప్రస్తుత పరిస్థితి చూస్తే వర్షాలు అనుకూలించకపోతే ఈ గ్రామాల పరిధిలో సైతం సాగునీరు అందడం కష్టంగా మారవచ్చు. మండలంలో తోటపాలెం, దుప్పలవలస, కొత్తపేట, పొన్నాడ, కొంగరాం, ధర్మవరం, ఓలేటి అగ్రహారం, రామజోగిపేట, భగీరథపురం, ముద్దాడ, బొంతలకోడూరు తదితర శివారు గ్రామాల పరిధిలో సుమారు ఐదు వేల ఎకరాల వరకు భూములకు సాగునీరు అందడం లేదు. వెద పద్ధతిలో వరి సాగు చేసే వారు నీటి కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే వేల రూపాయలు ఖర్చుచేసినా సాగుకు అనుకూల వాతావరణం లేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొరవడిన ప్రణాళిక..

సాగునీటి విషయంలో ప్రస్తుత సర్కారు సరైన ప్రణాళికతో వ్యవహరించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాలువలో మరమ్మతులు చేపట్టకపోవడం, పిచ్చిమొక్కలు, మట్టి మేటలు తొలగించకపోవటం, నీరు ముందుకు సాగేలా చర్యలు తీసుకునే లస్కర్ వ్యవస్థ లేకపోవటం వంటి అనేక సమస్యలు ప్రస్తుతం వెంటాడుతున్నాయి. దీంతో వర్షాలు అనుకూలిస్తే తప్ప వరి సాగు సాధ్యమయ్యే పరిస్థితి కనిపించటం లేదు. వ్యవసాయం మీద ఆధారపడ్డ ఎనిమిది పంచాయతీల పరిధిలోని రైతులు సాగునీటి కోసం ఎదురు చేస్తున్నారు.

ఆగస్టు వచ్చినా..



ఆగస్టు వచ్చినా వరి నాట్లు పడలేదు. వెదలు సాగు చేసిన రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక చేపట్టకపోవడమే సాగునీటి సమస్యకు కారణం. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు సమస్యపై దృష్టి పెట్టాలి.

– అల్లు సూర్యనారాయణ, రామజోగిపేట, ఎచ్చెర్ల మండలం


రామజోగిపేట సమీపంలో కాలువలోకి చేరని నీరు

ప్రత్యేక దృష్టిపెట్టాలి..



వేలల్లో పెట్టుబడులు పెట్టి వెదలు సాగుచేసిన రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. వరి నారు ముదిరి పోతోంది. నీటి కొరత కారణంగా నాట్లు పడే పరిస్థితి లేదు. సాగునీరు అందించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి.

– బొడ్డేపల్లి సుధాకర్, కొత్తపేట, ఎచ్చెర్ల మండలం

‘ఒలింపిక్స్ విజేతలను ఆదర్శంగా తీసుకోండి’


విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాహుల్ కుమార్ రెడ్డి

సారవకోట: విద్యార్థులు ఒలింపిక్స్ విజేతలను ఆదర్శంగా తీసుకోవాలని సీతంపేట ఐటీడీఏ పీఓ రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. ఆయన గురువారం మండలంలోని సవరబొంతు ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఒలింపిక్స్‌లో విజేతలుగా నిలిచిన వారి జీవితాల గురించి విద్యార్థులకు వివరించాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, వసతి గృహం పరిసరాలు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితుల గురించి ఆయన ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులను సూచించారు.

‘ఉత్తమ క్రీడాకారులను వెలికితీద్దాం’


మాట్లాడుతున్న భాస్కర్

ఎచ్చెర్ల క్యాంపస్: ఉత్తమ క్రీడాకారుల వెలికి తీత లక్ష్యంగా ముందుకు సాగాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఎ.భాస్కర్ అన్నారు. వర్సిటీ పరిధిలోని అఫిలియేషన్ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లతో గురువారం స్పోర్ట్స్ బోర్డు జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి డిగ్రీ, పీజీ, వృత్తి విద్యా కోర్సు కళాశాలలో క్రీడాకారులను గుర్తించాలని అన్నారు. క్రీడాంశాల వారీగా వారిని ప్రోత్సహించాలని చెప్పారు. అంతర విశ్వవిద్యాలయాల పోటీలకు ప్రత్యేక శిక్షణ ఇస్తే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారని చెప్పారు. జిల్లాలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బాక్సింగ్, అథ్లెట్ వంటి అంశాల్లో మెరుగైన క్రీడాకారులు ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు మధు, మోహన్‌రావు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమం బహిష్కరణ


సర్పంచ్‌లు శిక్షణను బహిష్కరించడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

కోటబొమ్మాళి: గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు చెప్పిందే అధికారులు చేస్తుంటే ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌లు ఎందుకున్నట్టు అంటూ వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు అధికారులను నిలదీశారు. కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అభివృద్ధి పనుల నిర్వహణపై 38 పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో అధికారులు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శిక్షణ ప్రారంభించేందుకు ఈఓపీఆర్‌డీ రామారావు, శిక్షకుడు ఎస్ఎస్ చైతన్య సన్నద్ధమవుతుండగా పలువురు సర్పంచ్‌లు లేచి పోడియం వద్దకు వచ్చి అధికారులతో వాగ్వాదానికి దిగారు. గ్రామాల్లో సర్పంచ్‌లను పిలవకుండా డీఎల్‌పీఓ, ఎంపీడీ, ఈఓపీఆర్‌డీ ఏకపక్షంగా టీడీపీ నాయకులను పిలిచి సమావేశాలు పెడుతున్నారని, పనులు వారితో చేయిస్తూ సంతకాలు సర్పంచ్‌లు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, సంతకాలు పెట్టకపోతే చెక్ పవర్‌ను రద్దు చేస్తామని బెదిరిస్తున్నారని అన్నారు. ఈ వైఖరిని నిరసిస్తూ శిక్షణను బహిష్కరించి వాకౌట్ చేశారు. దీంతో కేవలం గ్రామ కార్యదర్శులకు మాత్రమే శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పేడాడ వెంకటరావు, నూక సత్యరాజ్, బమ్మిడి గణపతి, రాంపాత్రుని సావిత్రి, కాళ్ల సంజీవరావు, మెండ తాత, సుంకరి జనార్దన, ఎస్‌వీ రమణ, మెట్ట సింహాచలం, కోత చిన్నారావు, పంకు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఖుర్దా డివిజన్‌లో డిజిటల్ చెల్లింపులు


ఖుర్దారోడ్ రైల్వే బుకింగ్ కౌంటర్ వద్ద క్యూఆర్ కోడ్ సౌకర్యం

భువనేశ్వర్: రైల్వే టికెట్ కొనుగోలు రంగంలో డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహానికి ఖుర్దా రోడ్ మండలం నడుం బిగించింది. డివిజన్‌లోని అన్ని రైల్వేస్టేషన్లలో టిక్కెట్ బుకింగ్ కౌంటర్లలో క్యూఆర్ కోడ్ డిస్‌ప్లే పరికరాలను ఇన్‌స్టాల్ చేయడం ప్రారంభించారు. రైలు టికెట్ కొనుగోలులో ఈ చొరవ ప్రయాణికులకు నగదు చెల్లింపు ఇబ్బందులు తొలగిస్తుంది. ప్రధానంగా చిల్లర బెడద దూరమవుతుంది. ఖుర్దా రోడ్ మండలం వ్యాప్తంగా అన్ని కేటగిరీల రైల్వే స్టేషన్లలో క్యూఆర్ కోడ్ డిస్‌ప్లే పరికరాలను ఇన్‌స్టాల్ చేస్తారు. అంచెలంచెలుగా 113 రైల్వే స్టేషన్లలో ఈ సౌకర్యం కల్పిస్తారు. డివిజన్‌లోని భువనేశ్వర్, పూరీ, ఖుర్దా రోడ్, బరంపురం, కటక్, భద్రక్, పలాస, జాజ్‌పూర్-కెంజొహార్ రోడ్, బలుగాంవ్, సోంపేట, ఇచ్ఛాపురం, ఢెంకనాల్, తాల్చేర్, పారాదీప్, దసపల్లా మొదలైన 75 రైల్వేస్టేషన్లలో ఈ సౌకర్యం ప్రస్తుతం అందుబాటులోకి వచ్చింది. మరో వారం రోజుల్లో డివిజన్ అంతటా మిగిలిన అన్ని స్టేషన్లకు ఈ సౌకర్యం విస్తరిస్తారు. రిజర్వ్‌డ్, సాధారణ శ్రేణి టిక్కెట్లను జారీ చేసే బుకింగ్ కౌంటర్లలో ఈ సౌలభ్యం అందుబాటులో ఉంటుంది. రైలు వినియోగదారులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన సేవలను కల్పించే ధ్యేయంతో ఖుర్దా రోడ్ డివిజన్ ఆధునిక సాంకేతికతను అవలంబిస్తోందని అధికార వర్గాలు తెలిపాయి.

మిస్సింగ్ బ్లాకులపై విచారణ



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: టెక్కలి పాత మైనింగ్ ఏడీ కార్యాలయం సమీపంలో సీజ్ చేసి ఉంచిన బ్లాకుల మిస్సింగ్‌పై పోలీసులు విచారణ జరుపుతున్నట్టుగా డివిజనల్ గనులు, భూగర్భ శాఖాధికారి డి.ఫణి భూషణ్‌రెడ్డి గురువారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ‘ఆ బ్లాకులు ఏమయ్యాయో’ శీర్షికన ‘సాక్షి’ బుధవారం సంచికలో ప్రచురితమైన కథనంపై మైనింగ్ శాఖ అధికారులు స్పందించారు. కనిపించని బ్లాకులపై ఆరా తీశారు. 15.917 క్యూబిక్ మీటర్ల బ్లాకులు పోలీసుల సంరక్షణలో ఉంచాల్సిందిగా అప్పట్లో కోరామని, పాత మైనింగ్ శాఖ ఏడీ కార్యాలయం సమీపంలో వాటిని ఉంచారని, ఇప్పుడవి కన్పించకపోవడంతో పోలీసులు విచారణ జరుపుతున్నట్టు ఫణిభూషణ్‌రెడ్డి ‘సాక్షి’ కి విడుదల చేసిన వివరణ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబీకుల శ్రీ దుర్గా భవానీ గ్రానైట్ ఇండస్ట్రీకి అక్రమంగా తరలించిన గ్రానైట్ బ్లాకులు 2022 మేలో పట్టుబడిన విషయం తెలిసిందే. అప్పట్లో కోటబొమ్మాళి పోలీసు స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. సీజ్ చేసిన వాహనాన్ని కోర్టు ఆదేశాలతో యజమానికి ఇవ్వగా, అక్రమంగా తరలిస్తూ దొరికిన బ్లాకులను పాత మైనింగ్ ఏడీ కార్యాలయంలో సమీపంలో ఉంచిన విషయం తెలిసిందే. ఇప్పుడా బ్లాకులు అదృశ్యమవ్వడం సంచలనమైంది.

ప్రముఖ కళాకారుడు చిన్నయాచారి మాస్టారు మృతి


చిన్నయాచారి మాస్టారు

పొందూరు: ప్రముఖ రంగస్థల కళాకారుడు, 65 ఏళ్లు నాటకరంగానికి సేవలందించిన సింహాద్రి చిన్నయాచారి మాస్టారు గురువారం ఉదయం మృతి చెందారు. పొందూరుకు చెందిన చిన్నయచారి మాస్టారు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే కళారంగానికి సేవలందించారు. హార్మోనీ వాద్య కళాకారుడుగా, మేకప్ ఆర్టిస్టుగా విలువైన సేవలందించారు. ఆయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పొందూరులోని తన స్వగృహంలో గురువారం ఉదయం కన్నుమూశారు. ఆయన పార్థివ దేహాన్ని చూసేందుకు వందలాదిగా విద్యార్థులు, కళాకారులు తరలివచ్చారు. ఆయన మృతిపై కళాకారుల సంఘం ప్రతినిధులు వి.మురళీమోహన్, బీ.శ్రీనివాసం, కె.శాంతారాం తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

చేపల చెరువుపై విష ప్రయోగం


విషం కలపడం వల్ల చనిపోయిన చేపలు

జి.సిగడాం: మండలం చంద్రయ్యపేట గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు కోరాడ వాణిశ్రీ కుమారుడు కోరాడ వెంకటేష్ చేపల చెరువులో విష ప్రయోగం జరిగింది. బాధితుడు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో పంచాయతీ ద్వారా చెరువు వేలం వేయగా.. వెంకటేష్ రూ.40వేలకు పాట పాడారు. ఈ చెరువులో మే నెలలో రూ.2.50 లక్షల విలువ చేసే చేపలను కొనుగోలు చేసి పెంచడానికి వేశారు. అయితే ఈ నెల 7న గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో చేపలు మరణించడానికి విషం కలిపారని వెంకటేష్ తెలిపారు.

దీని ప్రభావం వల్ల చేపలన్నీ చనిపోయాయని, వీటి విలువ రూ.5 లక్షలు ఉంటుందని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు.

‘సచివాలయ భవనాలు బాగున్నాయి’


జమ్ములో సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ ఈఈ

నరసన్నపేట: గ్రామాల్లో నిర్మించిన సచివాలయ, వెల్‌నెస్ కేంద్రాలు, ఆర్‌బీకే భవనాలు నాణ్యతగా ఉన్నాయని క్వాలిటీ కంట్రోల్ ఈఈ, ప్రస్తుత పీఆర్ ఎస్‌ఈ ఎంవీ శేఖర్ అన్నారు. మండలం కోమర్తిలో వెల్‌నెస్ కేంద్రం, యారబాడులో సచివాలయం, జమ్ములో ఆర్‌బీకే సచివాలయ భవనాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భవనాలు నాణ్యతగా ఉన్నాయని అన్నారు. వీటిని సక్రమంగా వినియోగించాలని సూచించారు. ఆయన వెంట నరసన్నపేట పీఆర్ డీఈ సత్యంనాయుడు, క్వాలిటీ కంట్రోల్ డీఈ శామ్యూల్‌లు ఉన్నారు.

ఘనంగా శ్రావణ చవితి వేడుకలు


పుట్టవద్ద పాలు పోసి పూజలు చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని భావసార క్షత్రియ సమాజ్ సభ్యులు శ్రావణ మాసంలో వచ్చే నాగుల చవితిని రెండురోజుల పాటు భక్తితో నిర్వహిస్తారు. గురువారం చవితి సందర్భంగా కుటుంబాలతో కలసి టౌన్‌హాలు వద్దనున్న పుట్ట వద్దకు వచ్చి రెండురోజుల పాటు నిర్వహించే ఉపవాసాలను విరమించుకున్నారు. స్వామి ప్రసాదాన్ని అందరూ స్వీకరించారు. కార్యక్రమంలో రంగ్రీజీ సభ్యులు భీమాజీరావు, సెక్రటరీ బాలజీ, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు వెళ్లిపోతున్నారు


కారిగూడ మినీ గురుకులం వద్ద గందర గోళం

కొత్తూరు: మండలంలోని కారిగూడ గిరిజన గ్రామంలో ఉన్న మినీ గురుకులం పాఠశాల విద్యార్థులు ఇంటిబాట పట్టారు. మినీ గురుకులంలో 202 గిరిజన బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ఈ పాఠశాలలో బాత్‌రూమ్‌లు లేకపోవడంతో పాటు నాణ్యమైన భోజనం పెట్టడం లేదంటూ విద్యార్థులు గురువారం పాఠశాల నుంచి వెళ్లిపోయారు. పాఠశాల ఎన్నికల సందర్భంగా వచ్చిన తల్లిదండ్రులతో కలిసి ఇళ్లకు వెళ్లిపోయారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ బాత్‌రూమ్‌లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. భోజనాల నాణ్యత కూడా బాగోలేదని తెలిపారు. అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లిపోతున్నామని పలువురు తల్లిదండ్రులు తెలిపారు. ఈ విషయం మినీ గురుకులం హెచ్‌ఎం హేమలత వద్ద ప్రస్తావించగా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఐటీడీఏ పీఓతో పాటు సంబంధిత ఉన్నతాధికారులకు చెప్పామన్నారు. దాదాపు 90 మంది విద్యార్థులను తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎస్ఎంసీ ఎన్నికల గందరగోళంలో ఈ ఘటన జరిగిందన్నారు.

‘ఆదివాసీ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలి’



కొరాఠింగులో నిరసన తెలుపుతున్న గిరిజనులు

కాశీబుగ్గ: ఆదివాసీ గ్రామాలన్నీ 5వ షెడ్యూల్‌లో చేర్చాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలాస మండలం తర్లకోట పంచాయతీలో గురువారం కొఠారింగు, గట్టూరు గ్రామాల్లో ఘనంగా ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఆదివాసీ హక్కుల కోసం, ఆదివాసీ సమస్యలపైన పోరాడాలని పిలుపునిచ్చారు. కొఠారింగి నుంచి గొప్పిలి, పలాస మెయిన్ రోడ్డు వరకు ఉన్న రహదారిని తక్షణమే మరమ్మతులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివాసీ గ్రామాలు ఐదో షెడ్యూల్‌లో లేనందున ఒకటి బై 70 చట్టం వర్తించనందున ఆదివాసీల భూములు ప్రైవేటీకరణకు గురవుతున్నాయని, ఆదివాసీలు ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ ప్రాంతంలో మౌలిక సౌకర్యాలు కల్పించడంలో పాలకవర్గాల విఫలమయ్యారని ఆయన అన్నారు. ఆదివాసీలు ఐక్యంగా తమ సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలని సూచించారు. మహోత్తర శ్రీకాకుళం సాయుధ గిరిజన రైతాంగ పోరాటం అనంతరం ఒకటి బై 70 చట్టం ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలు గిరిజన కార్పొరేషన్‌లో వచ్చాయని, అయినప్పటికీ ఆదివాసీలకు అరకొరగా ఉపయోగం తప్ప అసలు లక్ష్యాలు చేరలేదని అన్నారు. ఆయనతో పాటుగా సవర, తేజ, గోపాల్, సాంబ, నీలమ్మ, సుశీల, జయ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రణాళికలే అభివృద్ధికి కీలకం’


రిఫ్రెష్ శిక్షణ కార్యక్రమంలో సూచనలు చేస్తున్న జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర రావు

నందిగాం: పంచాయతీల అభివృద్ధికి వార్షిక ప్రణాళికలే కీలకమని జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల రిఫ్రెష్ గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం కాపాడే చర్యలు తీసుకోవాలని, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు గతంలో ప్రభుత్వం వేతనాలు అందించేదని, ప్రస్తుత పంచాయతీల నుంచి వేతనాలు అందిస్తుండటం ఇబ్బంది కలుగుతుందని మళ్లీ ప్రభుత్వమే వేతనాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజారావు, పలువురు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.